క్లుప్తంగా

27న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ధర్నా



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంచడంపై నిరసన వ్యక్తంచేస్తూ ఈ నెల 27న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని విమర్శించారు. విద్యుత్ బిల్లులు పెంచనంటూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు విస్మరించి ప్రజల నెత్తిన రూ.15వేల కోట్ల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ధర్నా చౌక్‌లో చేపట్టనున్న ఈ నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): డివిజన్‌లో ప్రజలు ఎదుర్కుంటున్న పలు సమస్యల పరిష్కార దిశగా పనులు చేపట్టినట్లు స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి తెలిపారు. ఎస్ఆర్‌పీ రోడ్డులో చేపట్టిన సీసీ పనులను కార్పొరేటర్ శార్వాణిమూర్తి సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇటీవల అమృత్ పథకం కింద డివిజన్‌లోని పలువీధుల్లో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం తీసిన గోతులను పూడ్చకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు స్థానికులు సమస్యను తనదృష్టికి తీసుకురావడంతో నగరపాలక సంస్థ ఉన్నతాధికారులతో మాట్లాడి ఆయా గోతులను పూడ్చించడంతోపాటు సీసీరోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

నేడు అక్కినేని విగ్రహావిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ఉదయం పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ అక్కినేని విగ్రహాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, గద్దే రామ్మోహన్‌రావు, యలమంచిలి సుజనాచౌదరి, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, వాకర్స్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ, అంతర్జాతీయ తొలి మహిళా శిల్పి డీ దేవికారాణి శిల్పి వుడయార్ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అక్కినేని అభిమానులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

యూనివర్సిటీ జట్టుకు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: నూజివీడులో ఇటీవల జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల నెట్‌బాల్ పోటీల్లో శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కాలేజీ జట్టు సత్తా చాటి రన్నర్‌గా నిలిచింది. జాతీయ విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్శిటీ జట్టులో కాలేజీ విద్యార్థినులు సిహెచ్.శ్రీజ, వి.రమ్మిత, బి.నవ్య, జి.ధనశ్రీ చోటు దక్కించుకున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన తెలిపారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్‌తో పాటు ప్రత్యేక అధికారి డాక్టర్ ఆర్.మాధవి, పీడీ డాక్టర్ ఎస్.హేమ, కోచ్ పి.భాస్కరరావు తదితరులు సోమవారం అభినందించారు.

కొల్లా జయశ్రీకి అవార్డు ప్రదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరానికి చెందిన సంఘసేవకురాలు కొల్లా జయశ్రీ బుడమేరు వరద బాధితులకు అందించిన సేవలకుగాను ఆమెకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డును ప్రదానం చేశారు. నగరంలో ఆదివారం జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో వక్తలు జయశ్రీ సేవలను కొనియాడి ఆమెను ఘనంగా సత్కరించారు. మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

నగరంలో క్రిస్మస్ శోభ

- అంతటా క్రిస్మస్ సందడి
- వీధుల్లో భారీ స్టార్ల ఏర్పాటు
- విద్యుద్దీపాలంకరణలో చర్చీలు



విద్యుద్దీపాలంకరణలో సింగ్‌నగర్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చి

అజిత్‌సింగ్‌నగర్/మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో అంతటా క్రిస్మస్ సందడి నెలకొంది. ఏసుక్రీస్తు పుట్టినరోజుకు గుర్తుగా యావత్ ప్రపంచం జరుపుకునే క్రిస్మస్ పండుగకు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ముస్తాబైంది. ఇప్పటికే నగరంలోని చర్చీలు..ప్రార్థనా మందిరాలతోపాటుగా పలు ప్రధాన కూడళ్లు.. కాలనీల్లో భారీ క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేశారు. చర్చిలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఎటుచూసిన విద్యుత్ కాంతులే...

క్రిస్మస్ పండుగ తరువాత సరిగ్గా మరో వారానికి నూతన సంవత్సరం కూడా ఉండటంతో కావడంతో క్రైస్తవ విశ్వాసులతో పాటు నగర ప్రజలు కూడా తమ ఇళ్ల ముందు స్టార్లు, ఇళ్లకు లైటింగ్ దండలు పెట్టి అలంకరించుకున్నారు. కొంతమంది యువత ఏకంగా తాము ఉంటున్న వీధులు, కాలనీల మొత్తం భారీ లైటింగ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో నగరంలో ఏవీధి చూసినా నూతన కాంతులతో విరజిల్లుతున్నాయి.

భారీ స్టార్‌లతో మెరిసిపోతున్న సింగ్‌నగర్..

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సింగ్‌నగర్ పరిసర ప్రాంతాలన్నీ మెరిసిపోతున్నాయి. సింగ్‌నగర్, లూనాసెంటర్, లెనిన్‌సెంటర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, పీఅండ్‌టీ కాలనీ, నందమూరినగర్, పాయకాపురం, శాంతినగర్, రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్‌నగర్, ప్రకాష్‌నగర్, కండ్రిక పరిసర ప్రాంతాల్లోని చర్చీలు, వీధుల వద్ద ఏర్పాటు చేసిన లైటింగ్‌లతో సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాలన్నీ మెరిసిపోతున్నాయి. ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని కళ్లకు కట్టేలా చూపేందుకు కొంత మంది యువత, చిన్నారులు కలిసి ఆయా వీధుల్లో వేసిన పశువుల పాకలు.. భారీ స్టార్‌లు.. క్రిస్మస్ సెట్టింగులు స్థానిక ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

మధురానగర్ ప్రాంతంలో..

నగరంలోని మధురానగర్, ముత్యాలంపాడు, రామకృష్ణాపురం, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, గులాబీతోట, భానునగర్, దుర్గాపురం, మాచవరం తదితర ప్రాంతాలలోని చర్చిలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. విశ్వాసులు వారి ఇళ్లు, అపార్ట్‌మెంట్ల వద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్లు, ట్రీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నేడు ప్రత్యేక క్రిస్మస్ ఆరాధనలు..

క్రిస్మస్ పండుగను బుధవారం జరుపుకోనున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి నగరంలోని అన్ని చర్చీలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించేందుకు ఆయా చర్చీల పెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈరోజు రాత్రి 7గంటల నుంచే పలు చర్చీల వద్ద క్రీస్తు పుట్టిన విధానాన్ని తెలుపుతూ.. బైబిల్‌లోని అనేక అంశాలను కళ్లకు కట్టేలా చిన్నారులు, యువత నాటికలు ప్రదర్శించనున్నారు.



పశువుల పాక సెట్టింగ్



విద్యుద్దీపకాంతులతో అంబేద్కర్ కాలనీలోని షియోను ప్రార్థనా మందిరం



ధగధగలాడుతున్న న్యూఆర్ఆర్‌పేటలోని అమలోద్భవి మాత దేవాలయం

మాజీప్రధాని పీవీకి ఘననివాళి



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు, కార్పొరేటర్ శర్వాణీమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దేశ ప్రధానిగా అనేక సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన మహామేధావి పీవీ నరసింహారావు అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్‌లో స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఆధ్వర్యంలో సోమవారం పీవీ నరసింహారావు వర్ధంతిని నిర్వహించారు. పీవీ చిత్రపటానికి మల్లాది విష్ణు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బలమైన ఆర్థిక వ్యవస్థకు పీవీ పునాదులు వేశారని కొనియాడారు. అంతర్గత భద్రత వ్యవహారాలు, విదేశాంగ వ్యవహారాల్లోనూ పీవీ అవలంభించిన దృఢమైన వైఖరి, దౌత్యనీతి.. దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని పటిష్ఠపరిచిందన్నారు. ఆర్థిక, విద్య, భూపరిపాలన తదితర రంగాల్లోనూ పీవీ నరసింహారావు ప్రవేశపెట్టి, అమలు చేసిన సంస్కరణల ఫలితాన్ని నేడు దేశ ప్రజలు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు రామకృష్ణ, కె.ఫణి, సనత్, నాదెండ్ల రవిశంకర్, తల్లప్రగడ గోపాలకృష్ణ, హనుమాన్ ప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీ విజేత కేబీఎన్ కళాశాల



కేబీఎన్ కళాశాల జట్టుకు బహుమతిని అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జె.నాగేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల నెట్ బాల్ (పురుషులు) టోర్నమెంట్ పోటీల్లో కేబీఎన్ కళాశాల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్, ఆంధ్ర లయోలా కళాశాల జట్లు వరుసగా ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయి. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యాన సోమవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల నెట్‌బాల్ (పురుషులు) టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జె.నాగేశ్వరరావు ప్రారంభించారు. అధ్యాపకులు డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం బాస్కెట్‌లో బాల్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. మొదటి నాకౌట్ మ్యాచ్‌లో ఆంధ్ర లయోలా కళాశాల జట్టు 12–7 స్కోర్‌తో డాక్టర్ ఎల్.హెచ్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(మైలవరం) పై విజయం సాధించింది.

రెండో నాకౌట్ మ్యాచ్‌లో కేబీఎన్ కళాశాల 15–2 స్కోర్‌తో పి.బి.ఎస్ కాలేజీపై గెలిచింది.లీగ్ మ్యాచ్‌లలో ఆంధ్ర లయోలా కళాశాల 9–8 స్కోర్‌తో ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ కళాశాలపై, కేబీఎన్ కళాశాల 12–3 స్కోర్‌తో నూజివీడు ప్రభుత్వ కళాశాలపై గెలిచాయి. డీఏఆర్ కళాశాలపై ఎస్.ఆర్.ఆర్ కళాశాల 5–3 స్కోర్‌తో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కేబీఎన్ కళాశాల 10–7 స్కోర్‌తో ఆంధ్ర లయోలా కళాశాలపై గెలిచింది. చివరి మ్యాచ్‌లో ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై కేబీఎన్ కళాశాల జట్టు 10–3 స్కోరుతో విజయం సాధించి విజేతగా నిలిచింది. నాలుగోస్థానంలో నూజివీడు డీఏఆర్ కళాశాల జట్టు నిలిచింది.విజేతలకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జె.నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు మేజర్ మన్నేయ స్వామి, శశాంక్, డాక్టర్ డి. యుగంధర్, డాక్టర్ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తాం : డీఈఈ

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు' శీర్షికన 'సాక్షి' దినపత్రిక సోమవారం ప్రచురించిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డులో ఒరిగిపోయి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఊ రామలింగేశ్వరరావుతో కలిసి డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఓ.బసవరాజు సోమవారం పరిశీలించారు. అనంతరం డీఈఈ మాట్లాడుతూ ఒరిగిపోయి ప్రమాదభరితంగా మారిన విద్యుత్‌స్తంభాల స్థానంలో నాలుగురోజుల్లో నూతన విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రత్యేక కథనం ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకునివెళ్లిన 'సాక్షి' దినపత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక డ్రైవ్



హెల్మెట్ లేని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రమాదసమయాల్లో ద్విచక్రవాహనదారులు ప్రాణాపాయం నుంచి తప్పించుకునేందుకు దోహదపడుతున్న హెల్మెట్‌ను వాహనదారులంతా తప్పనిసరిగా వినియోగించాలని త్రీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు సూచించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు, హైకోర్టు తీర్పులను అమలులో భాగంగా ట్రాఫిక్ పోలీసులు సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బీఆర్టీఎస్ రోడ్డులో హెల్మెట్ లేని వాహనదారులను గుర్తించి, వారికి హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. వారు హెల్మెట్ తెచ్చుకున్న తర్వాతనే వాహనాలను అక్కడ్నుంచి పంపించారు. ద్విచక్రవాహనదారుల నుంచి పెండింగ్ చలానాలను వసూలు చేశారు. రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. లేనిపక్షంలో జరిమానాతోపాటు వాహనాలను కూడా సీజ్ చేస్తామని సీఐ కిషోర్‌బాబు హెచ్చరించారు.

కళారంగానికి ప్రోత్సాహం



గద్దె శేషగిరిరావును సత్కరిస్తున్న గుప్తా, లయన్స్ క్లబ్ నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక, కళారంగాలకు లయన్స్‌క్లబ్ పెద్దపీట వేస్తోందని, కళాకారులను సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రోత్సహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ జిల్లా అంబాసిడర్ వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవే పరమావధిగా లయన్స్ క్లబ్ పనిచేస్తోందన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా కళా కారుల కోసం కృషి చేస్తున్న జిల్లా గవర్నర్ గద్దే శేషగిరిరావు సేవలను అభినందించారు. జిల్లా గవర్నర్ శేషగిరిరావు మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని వివరించారు. పేదలకు సేవచేయడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ విజయవాడ శాఖ అధ్యక్షుడు, కార్యదర్శులు రామకృష్ణ, రవీంద్రకుమార్, టీవీ గుప్తా, కేవీ శివప్రసాద్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన గాయనీ గాయకులు భక్తి గీతాలను ఆలపించారు. చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. లయన్స్ గవర్నర్ గద్దె శేషగిరి రావును వేముల హజరత్తయ్యగుప్తా సత్కరించారు.

రైతులకు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశానికి రైతు వెన్నెముక అయిన రైతును గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందని శ్రీ చైతన్య కళాశాల ఎగ్జిక్యూటివ్ డీన్ గుంటూరు హరిబాబు అన్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరురోడ్డులోని శ్రీచైతన్య కళాశాలలో సోమవారం పలువురు రైతులను సత్కరించారు. ఈసందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రైతులైన తమ విద్యార్థుల తల్లిదండ్రులను గుర్తించి వారిని సత్కరించినట్లు తెలిపారు. తమ కళాశాల రైతులను ఎల్లప్పుడూ తగిన రీతిలో గౌరవిస్తుందని వివరించారు. ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో రైతుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ప్రతీఒక్కరూ రైతు కష్టం, కృషిని గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం కె.రంగారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం. నీలిమ, డి.ఝాన్సీలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఫల, పుష్ప ప్రదర్శన నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంది. ఇంటి ప్రాంగణంలో పెంచే మొక్కలతోపాటు, ఇంటి లోపల, టెర్రస్‌లపై పెంచేందుకు అనువుగా ఉండే మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదర్శన ఈ నెల 26 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు గరిమెళ్ల జానకీ రామయ్య తెలిపారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



క్యాండిల్స్‌తో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ వరప్రసాద్



వాణి స్కూల్‌లో సెమీక్రిస్మస్ వేడుకల్లో శేషుబాబు, కృష్ణబాబు, విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని షియోను ప్రార్థనా మందిరం పాస్టర్ కసమాల వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీ షియోను ప్రార్థనా మందిరంలో సోమవారం సెమిక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేశారు. అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. క్రీస్తు గీతాలను ఆలపిస్తూ క్యాండిల్స్‌ను వెలిగించి ప్రార్థనలు చేశారు.

వాణి స్కూల్‌లో...

స్థానిక వాణి స్కూల్‌లో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ అంజూరు శేషుబాబు, పాస్టర్ బి.కృష్ణబాబు కేక్‌ను కట్‌చేశారు. క్రిస్మస్ పండుగ గురించి విద్యార్థులకు వివరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్ఎం ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలకు విరుద్ధంగా రాష్ట్ర క్రీడా పాలసీ

విజయవాడస్పోర్ట్స్: కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన క్రీడా పాలసీ, క్రీడాకారులకు వెన్నుపోటు పొడిచేలా ఉందని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.పి.రావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇది క్రీడా చట్టాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఒలింపిక్స్ క్రీడలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ..సంప్రదాయ క్రీడలకు ఈ పాలసీ అన్యాయం చేస్తోందన్నారు. హర్యానా రాష్ట్ర క్రీడా పాలసీని కాపీ కొట్టారని ఆరోపించారు. అనుభవం లేని అధికారులచే రాష్ట్ర క్రీడా పాలసీని తయారు చేయించారని ఎద్దేవా చేశారు. దేశీయ సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో, చదరంగం, యోగా, బాల్‌బ్యాడ్మింటన్, మల్కాంబ్ తదితర క్రీడలకు ఈ పాలసీ అన్యాయం చేస్తోందన్నారు.

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన క్రీడా పాలసీ ప్రకారం రాష్ట్రంలో చెస్ క్రీడలకు ఎలాంటి ప్రాధాన్యం లేదని, సీఎం చంద్రబాబు మనుమడు దేవాన్ష్ తాజాగా ఈ క్రీడలోనే ప్రపంచ రికార్డు నెలకొల్పాడని, ఇప్పుడు అతన్ని ఆంధ్రాకు బదులుగా తెలంగాణ రాష్ట్రం తరఫున ఆడించాలని వారి కుటుంబసభ్యులకు సూచించారు. గత ప్రభుత్వం ఒలింపిక్ క్రీడలతోపాటు, దేశీయ సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. స్పోర్ట్స్ కోటా ద్వారా 1,500 మందికి ఉద్యోగాలు ఇచ్చిందని, రూ.12 కోట్లను నగదు ప్రోత్సాహాలుగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన క్రీడాపాలసీ క్రీడాకారుల నడ్డివిరిచేలా ఉందని ఆయన విమర్శించారు.

వర్మీకంపోస్టు విక్రయకేంద్రం పరిశీలన



విక్రయకేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ సందర్భంగా ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సోమవారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం ద్వారా తయారుచేసిన వర్మి కంపోస్టును విక్రయ కేంద్రంలో ఉంచారు. ఈ కేంద్రం ద్వారా కిలో వర్మి కంపోస్ట్ ప్యాకెట్ రూ.20కు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అరకిలో, కిలో, రెండు కిలోల ప్యాకెట్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మొక్కల పెరుగుదలకు వర్మీకంపోస్టు ఉపయోగపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లాలో ఘన, ద్రవవ్యర్థాల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రజా ఫిర్యాదులపై దృష్టి సారించాలి : డీసీపీ



ఫిర్యాదీదారుతో మాట్లాడుతున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడస్పోర్ట్స్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పోలీస్ ప్రజావాణి) కార్యక్రమంలో ప్రజలు ఇస్తున్న ఫిర్యాదులపై దృష్టి సారించి, నిర్ణీత కాలవ్యవధిలో ఆయా ఫిర్యాదులను పరిష్కరించాలని డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ)ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి కమిషనరేట్ పరిధిలోని సీఐలను ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని 80మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. నగదు లావాదేవీలపై 33మంది, కుటుంబకలహాలపై ఆరుగురు, మహిళా సంబంధిత నేరాలపై ఒకరు, ఆస్తి వివాదాలపై 20మంది, మోసాలపై ముగ్గురు, దొంగతనాలపై ఇద్దరు, చిన్నచిన్న వివాదాలపై 15మంది ఫిర్యాదులు అందజేసినట్లు వివరించారు. ఫిర్యాదీదారులతో మాట్లాడిన అనంతరం సంబంధిత ఫిర్యాదులను పరిష్కరించాలని ఆయా స్టేషన్ల సీఐలను ఆదేశించారు.

ముగిసిన సైన్స్ ఎక్స్‌పో



సైన్స్ ఎక్స్‌పోలో బహుమతులు గెలుచుకొన్న విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు రోడ్డులోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో మూడురోజులుగా నిర్వహిస్తున్న సైన్స్ ఎక్స్‌పో సోమవారంతో ముగిసింది. ఎక్స్‌పోలో 477వర్కింగ్ మోడల్స్, 211 డిస్‌ప్లేలను ఉంచగా, నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 3684 మంది విద్యార్థులు సందర్శించారు. సైన్స్ ఎక్స్‌పో ముగింపు సందర్భంగా స్కూల్ డైరెక్టర్ వై పార్థసారధి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని అందించేందుకు సైన్స్‌ఎక్స్‌పో దోహదపడుతుందన్నారు. ఎక్స్‌పోలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 74మందికి ప్రథమ, 74మందికి ద్వితీయ, 74మందికి తృతీయ బహుమతులను అందజేశారు. ముగ్గురు విద్యార్థులు బెస్ట్ ఎగ్జిబిట్ అవార్డులు గెలుచుకున్నారు. ప్రతి సబ్జెక్ట్ కేటగిరీలో 7గురు బడ్డింగ్ ఐకాన్ మెగా బహుమతులు గెలుచుకున్నారు. ముగింపు కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.రాజేంద్ర, ఎం.లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.ప్రవీణ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.